నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శుక్రవారం 9 మే 2025 | SIDDIPET

రెవెన్యూ డివిజన్ సాధించే వరకు పోరాటం



చేర్యాలలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- పెండింగ్ పనుల పూర్తికి కృషి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మే 8: చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించే వరకు పోరాడుతానని, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన 19 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తాను విజయం సాధించినప్పటి నుంచి ఈ ప్రాంతంలో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా నీలిమా దవాఖానలో ఉచితంగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు ప్రభుత్వం నుంచి క్షతగాత్రులకు, బాధితులకు సీఎం సహాయనిధి నుంచి చెక్కులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో అన్ని గ్రామాల్లోని చెరువులు నింపేందుకు తాను తీవ్రంగా కృషి చేస్తున్నానని, ఇటీవల దేవన్నపేట పంపుహౌస్‌ను మంత్రులు ఉత్తమ్, పొంగులేటి సందర్శించినప్పుడు వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపడంతో కలిగే ప్రయోజనాలతో పాటు మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ వరకు రూ.300 కోట్లతో ప్రారంభించిన కాల్వ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని మంత్రులను కోరినట్లు తెలిపారు. దేవాదుల కాల్వల నిర్మాణం, భూసేకరణ, నిర్వాసితులకు అందించాల్సిన నష్టపరిహారం తదితర అంశాలను మంత్రుల సమీక్షలో లేవనెత్తినట్లు తెలిపారు. చేర్యాలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నానని, సంబంధిత శాఖల అధికారులు సైతం సకాలంలో ప్రభుత్వ కార్యాలయాల సమీకృత భవనం, ప్రభుత్వ దవాఖాన భవనాల పనులు పూర్తి చేయించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు.అనంతరం మున్సిపాలిటీలోని 7వ వార్డుకు చెందిన పోగుల శ్రీకాంత్‌ను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అంతకు ముందు మండలంలోని కమలాయపల్లి మాజీ సర్పంచ్ ఒరుగంటి అంజయ్య కుమారుడు వివాహ వేడుకకు ఎమ్మెల్యే హాజరై ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, సీనియర్ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, పుర్మ వెంకట్‌రెడ్డి, తలారి కిషన్, మంగోలు చంటి, బీరెడ్డి ఇన్నారెడ్డి, తాడెం రంజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల మానస, మీస పార్వతి,జింకల పర్వతాలు యాదవ్, మంచాల కొండయ్య, బూరగోని తిరుపతిగౌడ్, గదరాజు యాదగిరి, బొడిగం మహిపాల్‌రెడ్డి, ఎలికట్టె శివశకంర్, అరిగే కనకయ్య, ఆకుల రాజేశ్ గౌడ్, ఎర్రోల్ల యాదగిరి, బంగారిగల్ల కిరణ్‌కుమార్, రాము, పచ్చిమడ్ల చిన్న సతీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 8: ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలను ప్రపంచ పటంలో లేకుండా చేయాలని, అలాంటి దేశాలను ఏకాకిని చేసి బహిష్కరించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు ఒక్కటై తీవ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలని కోరారు. ప్రపంచం శాంతియుతంగా ఉన్నప్పుడే దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు పెరుగుతాయని, అప్పుడే దేశాలు అభివృద్ధి చెందుతాయన పేర్కొన్నారు. పాకిస్థాన్ లాంటి దుష్టదేశాలపై అంతర్జాతీయ సమాజం కఠినంగా వ్యవహరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రతి ఒక్కరూ స్వాగతించాలని, పాక్ ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. దేశ ఐక్యత, సమగ్రతకు అందరం కట్టుబడి ఉండాలన్నారు.

కార్యాలయాల ఏర్పాటు కలేనా!

- రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఏర్పాటు పత్తాలేదు..
- రెవెన్యూ డివిజన్, రిజిస్ట్రేషన్ కార్యాలయాలను మంజూరు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఏర్పాటును విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- సంగారెడ్డికి పోవడంతో సమయం, డబ్బులు వృథా
- పటాన్‌చెరు నుంచి రిజిస్ట్రేషన్ శాఖకు అధిక ఆదాయం

పటాన్‌చెరులో రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటెప్పుడో..?

పటాన్‌చెరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్

పటాన్‌చెరు పట్టణంలోని తహసీల్ కార్యాలయం

పటాన్‌చెరు, మే 8: బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేసి పాలన చేరువ చేసిన సంగతి తెలిసిందే. భౌగోళిక స్వరూపం దృష్ట్యా కొత్తగా రెవెన్యూ డివిజన్ కేంద్రాలు ఏర్పాటు రెవెన్యూ పాలన ప్రజలకు అందుబాటులో తెచ్చింది. బీఆర్ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ పటాన్‌చెరుకు రెవెన్యూ డివిజన్ కార్యాలయంతో పాటు రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని మంజూరు చేశారు. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులు పటాన్‌చెరు అభివృద్ధి పెద్దపీట వేశారు. అంతలోనే ఎన్నికలు వచ్చి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పటాన్‌చెరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం, రిజిస్ట్రేషన్ కార్యాలయాల ఏర్పాటు అటకెక్కింది. దీంతో నియోజకవర్గ ప్రజలకు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పనులు ఉంటే సంగారెడ్డి పట్టణానికి పోవాల్సి వస్తున్నది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పనులు ఉన్న ప్రతిసారి సంగారెడ్డికి పోవాల్సిందే. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం కావడంతో కేసీఆర్ ప్రభు త్వం పటాన్‌చెరుకు డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం మంజూరు చేసింది. బీఆర్ఎస్ హ యాంలో మంజూరు చేసిన ఈ రెండు కార్యాలయలను కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పా టు చేయడం లేదనే విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ కార్యాలయ ఏర్పాటు గురిం చి బీఆర్ఎస్ స్థానికులతో కలిసి పోరాటం చేయనున్నట్లు తెలిసింది. రిజిస్ట్రేషన్ శాఖకు ఈ ప్రాంతం నుంచి అధిక ఆదాయం వస్తున్నా పటాన్‌చెరులో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఆఫీసును మాత్రం ఏర్పాటు చేయడం లేదు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో ప్రజలకు మేలు

పటాన్‌చెరుకు రెవెన్యూ డివిజన్ కార్యాలయం మంజూరు చేసి, ప్రజలకు ప్రభుత్వ పాలన అందుబాటులోకి తెచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషిచేసింది. పటాన్‌చెరు, రామచంద్రపురం, అమీన్‌పూర్, జిన్నారం, గుమ్మడిదల మండలాలతో రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు బీఆర్ఎస్ సర్కారు అప్పట్లో జారీచేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్డీవో, రిజిస్ట్రేషన్ కార్యాలయలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేసినా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదు. భౌగోళికంగా సంగారెడ్డికి పటాన్‌చెరు 23 కిలోమీటర్లు, రామచంద్రపురం 31 కిలోమీటర్లు, అమీన్‌పూర్‌కు 33 కిలోమీటర్లు, జిన్నారం గ్రామానికి 36 కిలోమీటర్లు, గుమ్మడిదలకు 45 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ మండలాల ప్రజల రెవెన్యూ పనుల కోసం సంగారెడ్డికి వెళ్లడం దూర భారంగా మారింది. పటాన్‌చెరు పట్టణం కేంద్రంగా రెవెన్యూ డివిజన్, రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లు ఏర్పాటు చేస్తే ప్రజలకు సమయం, డబ్బులు కలిసి వస్తాయి. ప్రజలు ఇండ్లు, ఇంటి స్థలాలు, ఇతర వాణిజ్య భవనాలు అమ్మకాలు, కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ కోసం సంగారెడ్డి సమీపంలోని కందికి పోవాల్సి వస్తున్నది. పటాన్‌చెరులో కార్యాలయం ఉంటే సమయానికి రిజిస్ట్రేషన్ చేసుకొని ఇంటికి పోయి, పనులు చేసుకొనే పరిస్థితి ఉంటుంది. బీఆర్ఎస్‌కు పేరు రావద్దనే కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కార్యాలయాల ఏర్పాటును పెండింగ్‌లో పెట్టిందని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల మాజీ మంత్రి హరీశ్‌రావు రుద్రారంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఈ రెండు కార్యాలయాల ఏర్పాటుపై మాట్లాడడంతో మరోసారి ప్రజల్లో చర్చ మొదలైంది. ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నిర్వాకం ఇదేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు..

పటాన్‌చెరులో రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు రెవెన్యూ పాలన అందుబాటులోకి తెచ్చేందుకు రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదు. పటాన్‌చెరులో రెవెన్యూ డివిజన్ కార్యాలయం లేకపోవడంతో ప్రజలు భూ సమస్యలు ఉన్నప్పుడు, అధికారులను కలిసేందుకు సంగారెడ్డికి పోవాల్సి వస్తున్నది. రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయకపోవడంతో రిజిస్ట్రేషన్లకు కందికి పోవాల్సి వస్తున్నది. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలను దృష్టిలో పెట్టుకుని రెవెన్యూ డివిజన్ కార్యాలయం, రిజిస్ట్రేషన్ కార్యాలయం తొందరగా ఏర్పాటు చేయాలి. పటాన్‌చెరు అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూడడం మానుకోవాలి.

– ఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పటాన్‌చెరు

సంగారెడ్డికి పోవాల్సి వస్తున్నది..

రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ సమస్యలపై సంగారెడ్డి పట్టణానికి పోవాలంటే దూరభారంతో పాటు డబ్బులు ఖర్చవుతున్నాయి. పటాన్‌చెరులో రెవెన్యూ డివిజన్, రిజిస్ట్రేషన్ ఆఫీసులు ఏర్పాటు చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఆఫీసుల ఏర్పాటును పెండింగ్‌లో పెట్టడం మంచిది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టిసారించాలి.

– మాణిక్‌యాదవ్, ఐలాపూర్

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

సంగారెడ్డి జిల్లా మనూరు మండలం డోవూర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

మనూరు, మే 8: గ్రామాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు వచ్చాక పల్లెలకు నిధులు విడుదల చేయకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన రావడంతో గ్రామీణుల సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగక పోవడంతో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. మూడు నాలుగు గ్రామ పంచాయతీలకు కలిసి ప్రత్యేకాధికారులను నియమించడంతో వారు ఎప్పుడు ఏ ఊరిలో ఉంటారో తెలియని పరిస్థితి ఉంది. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం, డంపింగ్ యార్డుల నిర్వహణ, మొక్కల సంరక్షణ, నీటి పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారాయి. వీధిదీపాల నిర్వహణ సరిగ్గా లేకుండా పోయింది. సంగారెడ్డి జిల్లా మనూరు మండల కేంద్రంతో పాటు డోవూర్, మాయికోడ్, రాణాపూర్, బాదల్‌గావ్ తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు

డోవూర్ తండాలో పాఠశాల చుట్టూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

తుతూమంత్రంగా చేపడుతున్నారు. మురుగు కాలువలు సరిగ్గా శుభ్రం చేయక పోవడంతో దోమలు, ఈగలు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాలు, తండాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పంచాయతీలకు నిధుల లేమితో పంచాయతీ కార్యదర్శులు పనులు చేయించ లేకపోతున్నారు.గత ప్రభుత్వం నెలనెలా పంచాయతీలకు పల్లెప్రగతి నిధులు విడుదల చేసేది. దీంతో గ్రామాల్లో ఆయాలు పనులు చేపట్టేందుకు నిధులు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో సమస్యలు నెలకొన్నాయి.

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి

- సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట, మే 8: ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకం అని, జిల్లాలో లక్ష్యమేర సాగును ప్రోత్సహించాలని, అన్ని రైతువేదికల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి వారిని ఒప్పించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఆయిల్ ఫెడ్, వ్యవసాయ,ఉద్యానవన శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 12,339 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగవుతున్నదని, 2025-26సంవత్సరానికి 6500 ఎకరాల లక్ష్యం పెట్టుకున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి తెలిపారు. ఇప్పటి వరకు 665 ఎకరాల్లో సాగుకు 188 మంది రైతులను గుర్తించామని తెలిపారు. జిల్లాలో నుంచి 209 మంది రైతులకు చెందిన 492 టన్నుల ఆయిల్‌పామ్ గెలలు కటింగ్ చేసి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట ఫ్యాక్టరీకి పంపినట్లు తెలిపారు.అనంతరం ఉద్యానవన శాఖ జారీచేసిన ఆయిల్‌పామ్ సాగు కరపత్రాలను అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నర్మెట వద్ద రూ. 300 కోట్లతో ఆయిల్‌పామ్ కర్మాగారం నిర్మాణం జూన్ లోపూ పూర్తి అవుతుందని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు ఆయిల్‌పామ్ సాగు లాభాల గురించి వారిని సాగుకు ఒప్పించాలన్నారు. ఆయిల్‌పామ్ సాగులో దశలు రైతులను ఎంపిక చేయడం, డీడీ కలెక్షన్లు, మార్కింగ్, డ్రిప్ ఫిట్టింగ్, మొక్కలు పెట్టడం అనే పక్రియను వెంటవెంటనే పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ , ఉద్యాన వన , ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించి వందశాతం సాగు లక్ష్యాన్ని పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరించుకోవాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య
- ఈనెల 9 నుంచి 14వరకు లోక్ అదాలత్

న్యాయవాదులతో సమావేశమైన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి, మే 8 : బ్యాంకు ప్రతినిధులు చెక్‌బౌన్స్ కేసులను సాధ్యమైనంత వరకు రాజీతో ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా చొరవ చూపాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య సూచించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ (చెక్‌బౌన్స్) కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ఈనెల 9 నుంచి 14 వరకు సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో జరుగుతుందని తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో చెక్కు బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చని, జిల్లా న్యాయసేవాధికార సంస్థ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని న్యాయమూర్తి సౌజన్య తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. క్షణికావేశంలో ఇరువర్గాలు కేసులు పరిష్కరించుకొని విలువైన తమ సమయాన్ని కాపాడుకోవాలన్నారని సూచించారు.

ఎండల్లో కుక్కలతో జర జాగ్రత్త!

వేసవిలో కుక్కల ప్రవర్తనలో మార్పులు

దాడులకు పాల్పడే స్వభావం ఎక్కువ .. ప్రజలకు ఐపీఎం, పశువైద్యుల సూచనలు

హైదరాబాద్, మే 8(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఎండ ప్రభావంతో జనంతో పాటు జంతువులు అల్లాడుతున్నాయి. వీధి కుక్కలపై వేసవి ఎండ ప్రభావం తీవ్రంగా ఉంటున్నది. ఒకవైపు నీళ్లు, ఆహారం దొరక్క, మరోవైపు ఎండ వేడితో శరీర ఉష్ణోగ్రతలు పెరిగి వీధి కుక్కలు అల్లాడిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వాటి ప్రవర్తనలో మార్పులు చోటుచేసుకుంటాయని పశువైద్యులు చెబుతున్నారు. ఈ సమయంలో వాటితో జాగ్రత్తగా ఉండాలని, లేకపోతే దాడికి పాల్పడే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. వీధికుక్కలు కనిపించినప్పుడు వాటి కళ్లలోకి పరీక్షగా చూడకూడదని, వాటిని పట్టించుకోనట్టుగా ఉంటే దాడికి పాల్పడే అవకాశాలు తక్కువ అని సూచిస్తున్నారు. పెంపుడు కుక్కలను ఎక్కువసేపు ఎండలో ఉంచొద్దని, మాంసాహారం పెట్టకూడదని చెబుతున్నారు. మరోవైపు హైదరాబాద్ నారాయణగూడలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)కు కుక్కకాటు బాధితుల తాకిడి కూడా పెరిగింది. ఈ ఇనిస్టిట్యూట్‌కు సాధారణంగా నెలకు 2500 మంది కుక్కకాటు బాధితులు వస్తుంటారు. కానీ, ఏప్రిల్, మే నెలల్లో ఆ సంఖ్య 3,000కు పైగా ఉందని అధికారులు వెల్లడించారు. కుక్కల ప్రవర్తనలో మార్పులతో దాడులు పెరగడమే ఇందుకు కారణమని చెబుతున్నారు.

వేసవిలో కుక్కకాట్లు పెరుగుతాయి..

వేసవిలో కుక్కల్లో వచ్చే శారీరక మార్పులతో అవి గందరగోళంగా ప్రవర్తిస్తుంటాయి. వాటి దగ్గరకు వెళ్లినప్పుడు దాడి చేస్తాయి. కుక్క కరిస్తే నిర్లక్ష్యం చేయొద్దు. వెంటనే గాయాన్ని సబ్బుతో శుభ్రపరచాలి. గాయంపై నీళ్ల ధార పడేవిధంగా జాగ్రత్త తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల రేబిస్‌కు కారణమయ్యే వైరస్ బయటకు పోతుంది. ఆ తర్వాత వైద్యులను సంప్రదించి, యాంటీ రేబిస్ టీకా తీసుకోవాలి. ఈ టీకాలను ఐపీఎంలో ఉచితంగా అందిస్తున్నాం.

– డాక్టర్ శివలీల, ఐపీఎం డైరెక్టర్

'ఖేడ్' మార్కెట్ కమిటీకి గ్రహణం

- ఇరువర్గాల్లో కుదరని సయోధ్య
- ఆశావహుల్లో అసంతృప్తి
- ఈసారి ఎస్సీలకు రిజర్వేషన్ ఖరారు

పాలకవర్గం ఏర్పాటులో మీన మేషాలు.. ఏడాదిన్నర కాలంగా జాప్యం

నారాయణఖేడ్ మార్కెట్ యార్డు

నారాయణఖేడ్, మే 8: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గం ఏర్పాటులో తీరని ప్రతిష్టంభన కొనసాగుతున్నది. మార్కెట్ కమిటీ పదవులపై ఆశ పెట్టుకున్న ఆశావహులను అప్పుడు ఇప్పుడని ఊరిస్తున్నప్పటికీ నూతన కమిటీ కోసం అడుగులు ముందుకు సాగడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందే మార్కెట్ కమిటీ పదవి కాలం ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాదిన్నర కావస్తున్నా మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గం మాత్రం ఏర్పాటు కాలేదు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఐదారుగురు గట్టిగానే ప్రయత్నం చేస్తున్నట్టు ప్రచారం. ఎవరికి పదవి కట్టబెట్టాలనే విషయంలో ఎంపీ సురేశ్ శెట్కార్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డిల మధ్య సయోధ్య కుదరని కారణంగానే మరింత ఆలస్యం అవుతున్నదని చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్నది. రిజర్వేషన్ల ప్రాతిపదికన నారాయణఖేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీకి కేటాయించగా, నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్, నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావు పేట్, కల్హేర్ మండలం కృష్ణాపూర్, నాగల్‌గిద్ద మండలం శెల్గిర గ్రామాలకు చెందిన నలుగురితో పాటు మరో ఇద్దరు చైర్మన్ పదవిని ఆశించి ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. వీరిలో ఒకరిని చైర్మన్ పదవికి ఎంపిక చేసే విషయంలో మీనమేషాలు లెక్కిస్తుండడంతో మార్కెట్ కమిటీకి పట్టిన గ్రహణం ఇప్పట్లో వీడుతుందా అనే చర్చ సర్వత్రా కొనసాగుతున్నది. మరోవైపు పదవులు ఆశిస్తున్న ఆశావహులు రోజురోజుకు అసంతృప్తికి లోనవుతున్నారు. ఏదిఏమైనా ఏడాదిన్నర కాలంగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు ఎప్పుడు తెరపడుతుందో వేచిచూడాలి.

రిజర్వేషన్లతో సామాజిక న్యాయం

మార్కెట్ కమిటీల పదవుల కేటాయింపులో బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన రిజర్వేషన్ల విధానంతో సామాజిక న్యాయం జరిగిందని చెప్పవచ్చు. తొలిసారి 1998లో మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పడగా 2014 వరకు నలుగురు చైర్మన్లుగా కొనసాగారు. ఇందులో ముగ్గురు అగ్రకులాలకు చెందిన వారు కాగా, ఒక్క బీసీ అభ్యర్థికి మాత్రమే అవకాశం దొరిగింది. ఇక 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రిజర్వేషన్ల ఫలితంగా 2016 నుంచి 2023 వరకు చైర్మన్లుగా బీసీలకు అవకాశం దక్కింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఎస్సీలకు అవకాశం లభించినప్పటికీ ఇప్పటి వరకు కమిటీని ఏర్పాటు చేయకపోవడంపై పలు రకాల ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే..

నారాయణఖేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ కేటగిరీకి కేటాయించడంతో మేము ఎంతో సంతోషపడ్డాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర కావస్తున్నా మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయకపోవడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే. నియోజకవర్గంలో కీలకమైన మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని దళితులకు ఇవ్వడం ఇష్టం లేక జాప్యం చేస్తున్నారనే అనుమానం కలుగుతున్నది. ఈ విషయమై మేము మాలమహానాడు ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదిస్తాం. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే చొరవ చూపి మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలి

– విశ్వనాథ్, మాలమహానాడు, 'ఖేడ్' నియోజకవర్గ అధ్యక్షుడు

మార్కెట్ కమిటీని త్వరగా నియమించాలి

'ఖేడ్' మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గాన్ని నియమించాలి. కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన రిజర్వేషన్ల కారణంగానే మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి ఎస్సీ కేటగిరీకి అవకాశం వచ్చింది. ఏడాదిన్నర కాలంగా జాప్యం చేయడమంటే ఎస్సీలను చిన్నచూపు చూస్తున్నట్లు భావించాల్సి వస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదవి కాలం ముగిసిన వెంట వెంటనే కొత్త పాలకవర్గాలు ఏర్పాటు చేసింది. చైర్మన్ ఎంపిక విషయంలో ఇంత తాత్సారం చేయడమెందుకో అర్థం కావడం లేదు. – సాల్మన్, దళిత నాయకుడు, అంత్వార్